క్లుప్తంగా

కళావేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

వనపర్తిటౌన్: సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో రెండు సంవత్సరాలుగా ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామని, ఈసారి కూడా ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు జీహెచ్‌ఎం శంకర్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం అంకిత భావంతో పని చేస్తూ స్ఫూర్తి వంతంగా నిలుస్తున్న ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం ఈనెల 15వ, తేదీలోగా 9347425998, 9052949644 నంబర్లకు వాట్సాప్‌లో ఉపాధ్యాయుల పూర్తి వివరాలను పంపాలని పేర్కొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన డా.కేతూరి



పాన్‌గల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)నూతన అధ్యక్షులుగా నియమితులైన బీ మహేష్‌కుమార్‌గౌడును హైదరాబాద్‌లో మండల వాసి ఏఐసీసీ జాతీయ ఓబీసీ కో ఆర్డినేటర్ డా. కేతూరి వెంకటేష్ ఆదివారం కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మహేష్‌గౌడ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల సమస్యల పరిష్కారానికి కృషి


ఆశన్న

వీపనగండ్ల: పేదల ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా ఆశన్న తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ కార్యకర్తలు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై బాధ్యత ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్టీ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ



చిన్నంబావి: మండలంలోని గడ్డబస్వాపురం పాఠశాలకు పూర్వ విద్యార్థి సౌండ్ సిస్టమ్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌కు రూ.10వేల విలువైన మైక్, సౌండ్ స్పీకర్‌లను పూర్వ విద్యార్థి శ్రీకాంత్ అందజేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆయనను సన్మానించారు. పాఠశాల అభివృద్ధి కోసం సహకారం అందించడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యరాణి, సురేష్, అరవింద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి నివాళి



వనపర్తి రూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు నారాయణరెడ్డి పోరాట స్ఫూర్తితో ప్రజల కోసం పోరాడుదామని సీపీఐ జిల్లా నాయకులు రమేష్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం వనపర్తి సీపీఐ కార్యాలయంలో రావి నారాయణరెడ్డి 35వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కళావతమ్మ, మహేష్, లక్ష్మీనారాయణ, హనుమంతు, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 20వ వార్డు గాంధీనగర్‌లో అనారోగ్యంతో ఆనంద్ మృతి చెందాడు. ఈ విషయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆదివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్ అందజేశారు. నాయకులు ఎల్‌ఐసీ కృష్ణ, కృష్ణ బాబు, ద్యారపోగు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నూతన భవన నిర్మాణానికి భూమి పూజ

అమరచింత: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.45 లక్షలతో నూతన పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం భూమి పూజ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొన్ని తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయని తెలియడంతో, అదనపు గదులకు నిధులు మంజూరు చేయించామన్నారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


పాన్‌గల్‌లోని పెద్దమ్మ గుడి వద్ద..


ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో..


వీపనగండ్లలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో..

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలు కొలువుదీరాయి. గోపాల్‌పేట మండలంలో మొత్తం 106 గణపతి విగ్రహాలు, రేవల్లి మండలంలో 63 విగ్రహాలు కొలువుదీరినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్, రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపారు.

వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు కల్వరాల, తూంకుంట, సంగినేనిపల్లి, గోవర్ధనగిరి గ్రామాల్లో పలువురు యువకులు గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో మైకుల హోరు, యువకులు, పిల్లల కేరింతలతో పండుగ వాతావరణం నెలకొంది. వినాయక మండపాలకు తప్పని సరిగా పోలీసుల అనుమతి, నిబంధనలు పాటించాలి ఎస్‌ఐ శ్రీనివాసులు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు.

ఖిల్లాఘనపురం మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లోని వాడవాడలో గణనాథులు కొలువుదీరారు. ప్రత్యేకంగా తయారు చేసిన ఉండ్రాళ్ల పాశం, పులిహోర తదితర వంటకాలు చేసి మండపాల దగ్గర ప్రజలకు పంపిణీ చేశారు.

– 'సాక్షి' నెట్‌వర్క్


కొత్తకోటలోని గణేష్‌నగర్ కాలనీలో..


మదనాపురంలో గణపయ్య


ఆత్మకూర్‌లో..

మట్టి గణపతుల పంపిణీ


వనపర్తి పుర కార్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

వనపర్తిటౌన్: మట్టి గణపతులను పూజించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ దోహదపడాలని పుర చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం వినాయక చవితి సందర్భంగా 500 మట్టి గణపతులను పుర కార్యాలయంలో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఓపీతో చేసిన విగ్రహాలను పూజించడం వల్ల చెరువుల్లో ఉండే నీరు ప్రమాదకారిగా మారుతుందన్నారు. పీఓపీ విగ్రహాలు నీటిలో తొందరగా కరగవని, ఈ కారణంగా రూ.లక్షలు వెచ్చించిన విగ్రహాలతో ప్రయోజనం ఉండదన్నారు. అవోపా, వాసవీ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా మట్టి గణపతులు అందజేశారు. మట్టి ప్రతిమలు సహజ సిద్ధమైన రంగులతో ఉంటాయని, వాటి పూజించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు భువనేశ్వరి, కంచె రవి, నక్క రాములు, చీర్ల సత్యం, పుర ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


కానాయపల్లి పూజలు చేస్తున్న యువకులు


కొత్తకోట చౌరస్తాలో

డీజే పెడితే కేసులు నమోదు..

వనపర్తిటౌన్: డీజే సౌండ్ పెడితే యజమానులపై బైండోవర్ కేసులు బుక్ చేస్తామని ఎస్‌ఐ వీ జయన్న ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. డీజేలకు ఎలాంటి పర్మిషన్ లేదని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి డీజేలు పెడితే చర్యలు తీసుకొని, డీజేలను సీజ్ చేసి కోర్టులో అప్పగిస్తామన్నారు. వినాయక విగ్రహం ప్రతిష్ఠించే ప్రతి ఒక్కరు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, ఆన్‌లైన్‌లో అప్లై చేసిన క్యూఆర్ కోడ్ మండపాల వద్ద ఉంచాలని సూచించారు.

కొత్తకోట రూరల్: వినాయక చవితి సందర్భంగా, చివరి రోజు గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లే సమయంలో డీజేలతో తీసుకెళ్లవద్దని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని కొత్తకోట సీఐ రాంబాబు డీజే యజమానులను ఆదేశించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డితో కలిసి డీజే యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో గణేశ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. అలా కాకుండా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


పాన్‌గల్‌లో వినాయకుని పూజలో యువత, సంఘం నాయకులు


కొన్నూరులో గణపయ్య


ఆత్మకూర్‌లోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడు


వనపర్తి అయిజయ్యకాలనీలో

ఎంపీ, ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

అమరచింత: మండలంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ డీకే అరుణకు స్థానిక సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. పట్టణంలోని 3, 4, 9 వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి, మూడో వార్డు కౌన్సిలర్ విజయరాములు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు శ్యాంసుందర్, ప్రసాద్, కుతుబ్, రాజన్న పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

మస్తీపురానికి వచ్చిన ఎంపీ డీకే అరుణను కలిసి మండల కేంద్రంలో త్వరితంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలంటూ వినతి అందజేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయికుమార్, అఖిల్, అరవింద్, ఉదయ్ పాల్గొన్నారు.


అమరచింతలో ఎమ్మెల్యేకు వినతి అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

వారోత్సవాలు విజయవంతం చేయండి

వనపర్తి రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వారసులు ముమ్మాటికి కమ్యూనిస్టులేనని జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలకృష్ణ, సీపీఐ వనపర్తి పట్టణ కమిటీ కార్యదర్శి జె.రమేష్, సీపీఐ మహిళ నాయకురాలు కళావతమ్మ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నాయకులు ఎర్రకురుమన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనలో సామాన్య ప్రజలను ప్రతి గ్రామంలో చైతన్యం చేసి పోరాటవీరులుగా తీర్చిదిద్ది, ఆ పోరాటానికి నాయకత్వం వహించింది కూడా కమ్యూనిస్టులేనన్నారు. ఈ నెల 11 నుంచి 17వరకు పోరాట వారోత్సవాలకు సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చిందన్నారు. ఈ వారోత్సవాలను జిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్న కురుమన్న, విష్ణు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, నరేష్, జయమ్మ పాల్గొన్నారు.


వనపర్తిలో మాట్లాడుతున్న నాయకులు

కేసు నమోదు

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఓ వ్యక్తి అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరంగాపురానికి చెందిన చింతల సుమన్ ఈ నెల 6 నుంచి కనబడం లేదని, కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. తండ్రి నరసింహ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఆత్మకూర్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆదివారం పోలీస్ సిబ్బంది రామకృష్ణ, సురేందర్ తిప్డంపల్లికి బీట్ డ్యూటీపై వెళ్లారు. ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్ నిలిపి వివరాలు సేకరించగా.. అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారని తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కారు బోల్తా

వనపర్తి రూరల్: కారు బోల్తా పడి అయిదుగురికి స్వల్ప గాయాలైన సంఘటన ఆదివారం రంగాపురం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గకు చెందిన నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కారులో మహబూబ్‌నగర్ జిల్లా కోస్గిలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పెబ్బేరు మండలం, రంగాపురానికి దగ్గరలో ఎన్‌హెచ్ 44పై కారు బోల్తా పడి అయిదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

శంకరసముద్రానికి స్వల్ప వరద

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని కానాయపల్లి గ్రామ శివారులోని శంకరసముద్రానికి స్వల్పంగా వరదనీరు వస్తుండటంతో అధికారులు గేట్లు ఎత్తి కిందకు నీటిని వదిలారు. శంకరసముద్రానికి పైనుంచి 1500 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. ప్రాజెక్టుకు ఉన్న 5గేట్లను రెండు ఫీట్లు పైకి ఎత్తి 2000 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలినట్టు అధికారులు తెలిపారు. వరద నీరు తగ్గుముఖం పట్టినా కానీ ముందస్తు జాగ్రత్తగా ప్రాజెక్టుకు ఉన్న 5 గేట్లను ఎత్తినట్టు అధికారులు వెల్లడించారు.

పంటలు పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

వనపర్తి రూరల్: శ్రీరంగాపురానికి చెందిన సుబ్బయ్య, బొక్కలయ్య, కురుమయ్య, ఆంజనేయులుకు చెందిన వరి, వేరుశనగ పంటలు వర్షాలకు దెబ్బతిన్నడంతో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, స్థానిక నాయకులతో కలిసి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెబ్బేరు ఉమ్మడి మండలంలో వర్షాలకు వరి మడుల్లో ఇసుక మేటలు వేసి, పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. రైతు ప్రజా ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరిగేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. గోవిందు, విష్ణు, రాంచందర్, రామరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీరంగాపురంలో రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం


పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో గురువులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఖిల్లాఘనపురం పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబ పరిస్థితులు, గత అనుభవాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన 21మంది గురువులను శాలువాలు, పూలమాలలు, మెమోంటోలతో సన్మానించారు.

రక్తదాన శిబిరం..

103 మంది పూర్వవిద్యార్థులు హాజరై ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు సహకారంతో 30 మంది పూర్వవిద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నవీన్, మధులు మాట్లాడుతూ రక్తదానంతో మరో ముగ్గురు వ్యక్తుల ప్రాణాలు కాపాడ వచ్చన్నారు. పూర్వ విద్యార్థులు రక్తదానం చేయడం ఆదర్శమన్నారు.


ఖిల్లాఘనపురంలో రక్తదానం చేస్తున్న యువకులు


ఖిల్లాఘనపురం మండలం వెంకటాంపల్లి రెడ్డి చెరువు

చెరువులకు జలకళ

- మత్తడి దూకిన చెరువులు, కుంటలు

ఖిల్లాఘనపురం: మండలంలో ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడంతో కుంటలు, చెరువులు నిండాయి. మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ, పర్వతాపురం, షాపురం, దొంతికుంట తండా, వెంకటాంపల్లి, ఆగారం, తిర్మలాయపల్లి, మల్కాపురం తదితర గ్రామాల్లోని చెరువులు, చెక్‌డ్యాంలు పూర్తి స్థాయిలో నిండి మత్తడి దూకాయి. యాసంగి పంటలకు కూడా నీళ్ల సరిపడేలా ఉన్నాయి. చెరువులు నిండటం, కాల్వలు, వాగులు పారడంతో భూగర్భజలాలు, బోరుబావుల్లో నీళ్ల పెరిగినట్లు రైతులు తెలియజేశారు.


కమాలొద్దీన్‌పూర్ చెరువు


సల్కెలాపురం ఉప్పరివాని చెరువు


అప్పారెడ్డిపల్లి చెక్‌డ్యాం

చెక్కుల పంపిణీ



వనపర్తి రూరల్: సీఎం సహాయనిధి చెక్కులను శనివారం శ్రీరంగాపురం మండలంలోని జానంపేటకు చెందిన వంకరమోని లోకేశ్వరికి రూ.14వేలు, కావలి ఎల్లన్నకు రూ.8 వేలు, పి.చిన్నచింతలయ్యకు రూ.6 వేలు, శివరాజుకు రూ.28 వేలు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామంలో బాధితులకు అందజేశారు. ఎండి ఉమ్మర్, నరసింహ, శేఖర్‌రెడ్డి, వడ్ల వెంకటయ్య, వి కురుమన్న పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన వంగూరి సుభద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుంటుంబాన్ని పరామర్శించారు.

మంచికోరే ఉపాధ్యాయులను మర్చిపోరు

వనపర్తిటౌన్: విద్యార్థుల మంచి కోరి, వారిని ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేసే ఉపాధ్యాయులను ప్రజలు మర్చిపోరని గణిత వేదిక జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. గురుపూజోత్సవంలో భాగంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న జీహెచ్‌ఎం పలుస శంకర్‌గౌడ్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల పని తీరును పర్యవేక్షించడంలో హెచ్‌ఎంల బాధ్యత కీలకమైందని, చిత్తశుద్ధితో నిర్వహిస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉంటూ అందరి ప్రశంసలు అందుకోవడం కష్టసాధ్యమని అన్నారు. విద్యాశాఖకు, సమాజానికి, తనవంతు సేవలందించిన శంకర్‌గౌడ్ వనపర్తి జిల్లా ప్రజల్లో చిరస్థాయిగా నిలుస్తాడని కొనియాడారు. అక్షరదీక్ష, విలువల విద్య, బాల సాహిత్య సభలతో విద్యార్థుల అభ్యున్నతికి శంకర్‌గౌడ్ విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, సంజీవయ్య స్వామి, వెంకట్‌రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.


శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు